ప్రజాశక్తి
ఆదివారం 11 మే, 2025 5
శ్రీకాకుళం

నేడు శ్రీశూద్రగంగ కావ్య గాన సభ

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

శ్రీకాకుళం నగరంలోని స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఆదివారం శ్రీశూద్రగంగ 'కావ్య గాన సభ నిర్వహించనున్నారు. కవి, జాతీయ ఉత్తమ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ కావ్య గానం చేయనున్నారు. దీనిపై ప్రముఖ రచయితలు, కవులు తమ ప్రతిస్పందనలను వినిపించనున్నారు. అనంతరం డాక్టర్ సుద్దాల అశోక్ తేజను సాహితీ వేత్తలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, అభిమానులు సత్కరించనున్నారు. శ్రీకాకుళ సాహితి, సాహితీ స్రవంతి సంయుక్తంగా నిర్వహిస్తున్న కావ్యగాన సభ సాయంత్రం 5.30 గంటలకు మొదలు కానుంది. సభకు సాహిత్య అభిలాషులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

'పుర మిత్ర'తో పురపాలక సేవలు

- సమస్యల పరిష్కారానికి నిరీక్షణ అవసరం లేకుండా చర్యలు
- అందుబాటులోకి 150 రకాల ప్రభుత్వ సేవలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం నగరంతో పాటు పట్టణ ప్రాంతాల్లో నివాసముంటున్న వారి కోసం పురపాలక సేవలు నేరుగా పొందడానికి ప్రభుత్వం పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కారానికి రోజుల సమయం నిరీక్షణ, అధికారులకు ఫిర్యాదు చేయాలన్నా కార్యాలయానికి వెళ్తే అందుబాటులో ఉండక అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఫిర్యాదు కోసమే రోజులు, గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నుంచి బయటపడేందుకు పురపాలక శాఖ కొత్తగా పుర మిత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మొబైల్ చేతిలో ఉంటే తక్షణమే ఎలాంటి ఫిర్యాదునైనా యాప్ ద్వారా పంపించుకోవచ్చు. 150 రకాల సేవలను పుర మిత్ర యాప్ ద్వారా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ యాప్‌లో పలురకాల సేవలను శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు పలాస-కాశీబుగ్గ, ఇచ్ఛాపురం, ఆమదాలవలస మున్సిపాలిటీల్లో పొందడానికి వీలుంది.

యాప్ ద్వా రా 150 రకాల సేవలు

సమస్యకు సంబంధించిన ఫొటో తీసి ఫోన్‌లో వాయిస్ రికార్డులో సమస్యను వివరిస్తే, ఆ సమస్య సమాచారం సంబంధిత విభాగ అధికారికి చేరుతుంది. కనీసం మూడు రోజుల నుంచి 15, లేదా 30 రోజుల గడువు లోగా సమస్యను పరిష్కరిస్తారు. యాప్‌ను ప్లేస్టోర్‌లో ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. దీన్ని నేరుగా డౌన్‌లోడ్ చేసుకుని లాగిన్ కావచ్చు. పురపాలక రెవెన్యూ, పట్టణ ప్రణాళికా విభాగం, ఇంజినీరింగ్, అకౌంట్స్, పరిపాలన విభాగాలకు సంబంధించి 150 రకాల పౌర సేవలను పొందుపరిచారు. ఇతర ప్రాంతాల్లో సమస్యనైనా అధికారుల దృష్టికి తీసుకురావడానికి వెసులుబాటు కల్పించారు. ప్రజలు సమస్యను అధికారులకు తెలిపేందుకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పారిశుధ్యం, నీటి సరఫరా, వీధిదీపాలు వంటి సమస్యలను నేరుగా ఫిర్యాదు చేసుకోవచ్చు. జనన, మరణ ధ్రువపత్రాలు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ వంటివి ఇందులో పొందడానికి వీలు కల్పించారు. అలాగే బిల్లుల చెల్లింపునకు ఇందులో అవకాశం కల్పించారు.

సమస్య పరిష్కారంపై ఎప్పటికప్పుడు తెలుసుకునే వెసులుబాటు కూడా ఈ యాప్‌లో ఉంది. ప్రజలు పంపిన సమస్యను సకాలంలో అధికారులు పరిష్కరించాలి. ఏం చర్యలు చేపట్టారో అధికారులు క్షేత్రస్థాయిలో ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల ఫిర్యాదు పరిష్కారంలో పురోగతిని తెలుసుకునేందుకు వీలుంటుంది. అధికారి స్పందించకపోతే పైస్థాయి అధికారికి చేరుతుంది. అక్కడ్నుంచి అపరిష్కృత జాబితాలో పడుతుంది. సంబంధిత అధికారిని బాధ్యుడిని చేసి పరిష్కారం చూపే వరకు ఆయనే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఈ యాప్ వినియోగంతో పుర ప్రజలకు అందిస్తున్న సేవల్లో ఎలాంటి మార్పులు వస్తాయో చూడాల్సి ఉంది.

మాట్లాడుతున్న తాండ్ర ప్రకాష్

గ్రామీణ ప్రాంతాల్లో
20న నిరసన ప్రదర్శనలు

జిల్లా కార్మిక, రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

లేబర్ కోడ్లు రద్దు, తదితర డిమాండ్‌తో ఈనెల 20న నిర్వహించనున్న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని జిల్లాలోని కార్మిక, రైతు సంఘాలు పిలుపు నిచ్చాయి. శనివారం నగరంలోని క్రాంతి భవన్‌లో సంయుక్త కిసాన్ మోర్చా, రైతు సంఘాల, ట్రేడ్ యూనియన్ల జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ పంటల మద్దతు ధరల చట్టం తీసుకురావాలన్నారు. రైతుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలన్నారు. రైతులకు పెట్టబడి సాయంగా రూ.20 వేలు తక్షణమే చెల్లించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబరు కోడ్లు రద్దు చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు అమలు వల్ల కార్మికవర్గ ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. వెట్టిచాకిరీ, బానిస విధానాన్ని కార్మికుల నెత్తిన రుద్దే చర్యలు సరికాదన్నారు. కార్మికవర్గం ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. దేశవ్యాప్త సమ్మెతో కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వానికి కనువిప్పు కావాలన్నారు. ప్రభుత్వానికి ఒక కనువిప్పు కలిగేలా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటును తిరస్కరించాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ ద్వారా రెండు వందల రోజుల పని దినాలతో పాటు, రోజువారి కూలీ రూ.600కు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించి సెకీ, యాక్సిస్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేయాలన్నారు. నూతన మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల వృత్తిదారుల హక్కులు కాపాడాలన్నారు. ధాన్యం, జీడిపంట, కొక్, శనగ, మినుములు తదితర పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే రైతు ఉత్పత్తులను కొనుగోలు చేయలన్నారు. కార్మికులు తమ పోరాటాల సాధించిన హక్కులు, చట్టాలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని, కార్మికవర్గం తమ శక్తిని ఈ సమ్మె ద్వారా చాటాలని కోరారు. స్వదేశీ, విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల అనుకూల చట్టాలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా సమ్మె పురస్కరించుకొని గ్రామ, మండల, డివిజన్ కేంద్రాల్లో నిరసన, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర. ప్రకాష్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.చంద్రరావు, కె.మోహనరావు, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు ఐఎఫ్‌టియు జిల్లా నాయకులు కృష్ణవేణి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.సంతోష్ పాల్గొన్నారు.

దరఖాస్తుల అభ్యంతరాలు స్వీకరణ

ప్రజాశక్తి- పలాస

రాష్ట్ర ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తున్న పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీల భర్తీకి జిల్లా సెలక్షన్ కమిటీ చైర్మన్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆధ్వర్యాన ప్రారంభించినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ఆధ్వర్యాన ఖాళీలైన రెసెప్షన్ కమ్ రిజిస్ట్రేషన్ క్లర్క్, ఒకటి, డయాలిసిస్ టెక్నీషియన్ ఆరు, సీ-ఆర్మ్ టెక్నీషియన్ రెండు, జనరల్ డ్యూటీ అటెండెంట్లు మూడు, 3, సెక్యూరిటీ ఒకటి పోస్టుల భర్తీకి మొత్తం 289 దరఖాస్తులు స్వీకరించామని అన్నారు. తాజాగా సవరించిన అభ్యర్థుల జాబితాను విడుదల చేయగా, దానికి సంబంధించి అభ్యర్థులెవరైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఆధారాలతో కూడిన గ్రీవెన్స్ దరఖాస్తులను మే 12 నుంచి 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు ఆస్పత్రి సూపరింటెండెంట్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. పైన పేర్కొన్న పోస్ట్ ప్రొవిజనల్ లిస్ట్, గ్రీవెన్స్ ఫారమ్, పూర్తి వివరాల కోసం జిల్లా వెబ్‌సైట్ www.srikakulam.ap.gov.inను సందర్శించాలని ఆమె సూచించారు.

మెజిస్ట్రేట్ల నియామకానికి వినతి

పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

శ్రీకాకుళం లీగల్: జిల్లా కోర్టులో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హైకోర్టు జడ్జి సత్తి సుబ్బారావు అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం అతిథిగృహంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు తంగి శివప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు అధ్యక్షతన జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉన్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, ఎగ్జిక్యూటివ్ కోర్టు, మొబైల్ కోర్టులకు తక్షణమే మెజిస్ట్రేట్లను నియామకం చేయాలని, మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పందించిన ఆయన ఈ సమస్యలు తన దృష్టిలో ఉన్నాయన్నారు. త్వరలో నియామకాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఇప్పిలి సీతరాజు, కార్యవర్గ సభ్యులు ఎం.భవానీప్ర సాద్, జి.వనజాక్షి, వరప్రసాద్, రమణమూర్తి, స్టేట్ బార్ మెంబర్ గేదేల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు పి.వి.రమణ ధయాల్, పి.వి.రమణారావు, ఎన్ని సూర్యారావు, గణపతిపట్నాయక్, ఎం.క్రాంతి, కిలారి ఈశ్వరరావు, జె.తిరుపతిరావు, బి.ఎస్.చలం, శేషగిరిరావు, అపిష్‌నాయుడు, ఎం.అన్నంనాయుడు, శంకర్‌నారాయణ పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

ఎమ్మెల్యే గౌతు శిరీష

తాగునీటి కుళాయిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

పలాస : ఆఫ్‌షోర్ నిర్వాసిత కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం ఎన్‌టిఆర్ కాలనీలో జలజీవన్ పథకంలో భాగంగా రూ.3.16 కోట్లతో ఏర్పాటు చేసిన తాగునీటి పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిర్వాసితులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేస్తుందని తెలిపారు. నిర్వాసితుల కాలనీలో తాగునీటికి ఇబ్బంది లేకుండా కుళాయి ద్వారా నీటిని అందించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ వసంత్ కుమార్, ఎపి ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబాబూరావు, టిడిపి మండల అధ్యక్షులు కూత్తుమ లక్ష్మణ్ కుమార్, టిడిపి నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, లోడగల కామేశ్వరరావు, సప్పగా నవీన్, కె.నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగులకు ప్రోత్సాహకాలు

శ్రీకాకుళం: ఆర్‌టిసిలో వివిధ సేవల్లో కెఎంపిఎల్ సాధించడంలో ప్రతిభ కనబరచిన సిబ్బందికి శ్రీకాకుళం 2వ డిపో గ్యారేజ్ ఆవరణలో అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో గత నెలలో అత్యధిక కెఎంపియల్ సాధించిన డ్రైవర్లలో ప్రథమ బహుమతిని ఎస్.అప్పన్న, సాధించారు. ఆయన 142.62 లీటర్ల డీజిల్ ఆదా చేసినందుకు రూ.500 నగదు ప్రోత్సాహకాన్ని డిపో మేనేజరు శర్మ అందజేశారు. అలాగే ఎస్.లక్ష్మణరావు 139.85 లీటర్ల డీజల్ ఆదా చేసి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఆయనకు రూ.300 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అలాగే ఇపికెలో ప్రతిభ కనబరచిన ఏడుగురు సిబ్బందికి ప్రోత్సాహకాలను అందజేశారు. కండక్టర్లు పి.రామకృష్ణ, ఎస్.జె.రావు, జి.కె.నాయుడులకు రూ.వంద వంతున ప్రోత్సాహాన్ని అందజేశారు. అలాగే కండక్టర్ బి.ఆర్.మూర్తి రూ.500, చంద్రరావు రూ.400, కె.వి.రమణ రూ.300 వంతున పురస్కారాలను అందుకున్నారు. ఇంధన పొదుపుతో పాటు ఒఆర్ పెంపునకు కృషి చేసిన సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ (మెకానికల్) చాణుక్య, డిసపి ఆయిల్స్ రమేష్, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ మూర్తి పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలను అందజేస్తున్న మేనేజర్ శర్మ

అర్ధరాత్రి నగరంలో చోరీ

బంగారం, నగదు అపహరణ

చిందరవందరగా పడేసిన సామగ్రి

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రూరల్ మండలం పరిధిలోని ఖాజీపేట పంచాయతీ లక్ష్మీనగర్ కాలనీ అజంతా గార్డెన్ గ్రూప్ హౌస్‌లోని ఓ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో అర్జల గురుమూర్తి ఇంట్లో ఉన్న 15 తులాల బంగారం, రూ.20 వేలు నగదు అపహరణకు గురైనట్టు బాధితుడు రూరల్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. వివరాల్లోకి వెళ్తే.. ఈ నెల 6న గురుమూర్తి కుటుంబ సమేతంగా పలాస నియోజక వర్గంలోని ఉంకులూరులోని మేనకోడలు వివాహ వేడుకకు వెళ్లారు. వివాహ వేడుక ముగించుకుని తిరిగి కుటుంబ సమేతంగా శనివారం ఉదయం 7 గంటలకు ఇంటికి చేరుకున్నారు. ఇంటికి వచ్చి చూడగా ప్రధాన ద్వారం ధ్వంసం చేసి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బెడ్రూమ్ తలుపులు తెరిచి ఉంది. ఆ గదిలో ఉన్న బీరువా తెరిచి బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో భద్రపరిచిన సుమారు 15 తులాల బంగారంతో పాటు, రూ.20వేలు నగదు చోరీకి గురైందని గుర్తించి రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సిఐ పైడపునాయుడు, రూరల్ ఎస్‌ఐ రాము సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆధారాల కోసం క్లూస్ టీమ్‌ను పిలిపించి వేలిముద్రలను సేకరించారు. సిసి కెమేరాను పరిశీలించగా, ఓ దుండగుడు గోడదూకి ఇంటి తాళాలు బద్దలుకొట్టి చోరీకి పాల్పడినట్లు సిసి ఫుటేజ్ ద్వారా పోలీసులు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సమీపంలో ఉన్న సిసి ఫుటేజ్‌ను సేకరించి నిందితుల ఆచూకీ కోసం పోలీసులు గాలింపు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దశరథ మృతదేహం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్/నందిగాం

టెక్కలి మండలం జగతిమెట్ట సమీప జాతీయ రహదారిపై శనివారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో వధువు మృతి చెందాడు. దీంతో పెళ్లింట విషాదం నెలకుంది. మొదటి భార్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో... నెల రోజుల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఉన్నాయి. నందిగాం మండలం రజనబొడ్డపాడుకు చెందిన బొడ్డ దశరథ (46) కోటబొమ్మాళి మండలం శ్రీపురంలో ఉంటున్న తన కుమార్తె ఇంటికి బైక్‌పై వెళ్లాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా... జగతిమెట్ట వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రమాద స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. శవపంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. సిఐ అంబటి విజయకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి మొదటి భార్య శోభారాణి కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో నెల రోజుల క్రితం హేమలతను వివాహం చేసుకున్నాడు. ఇప్పుడు దశరథడు మృతి చెందడంతో భార్య, పిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట

శ్రీకాకుళం: నాగావళి నది పరివాహక ప్రాంతాలు, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెట్టి, చట్ట వ్యతిరేక కార్యకలాపాల్ను అరికట్టే దిశగా కృషి చేస్తున్నామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో డచ్ బంగ్లా, కంపోస్టు కాలనీ, దమ్మవీధి, గుడివీధి ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం, పేకాట, ఈవిటిజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశామన్నారు. పాడైన బంగ్లాలపై, నివాస గృహాలపై డ్రోన్ కెమెరాలతో బహిరంగంగా మద్యం, గంజాయి తాగడం వంటి వారు పట్టుబడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉగ్రవాదం అంతుచూడాలి

కవిటి: ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ అన్నారు. భారత సైన్యానికి మద్దతుగా కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాల సిబ్బంది విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాకిస్తాన్ ఎన్ని డ్రోన్లు ప్రయోగించినా భారత సైన్యం వాటిని తుక్కుతుక్కుచేస్తుందని అన్నారు. అనంతరం భారత్ మాతాకీ జై, సలాం సైనికా అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ప్రిన్సిపాల్ బిందు మాధవి, ఎఒ రాణి, బల్లెడ రమేష్ పాల్గొన్నారు.

నేతలకు భరోసా... నిరుద్యోగులకు నిరాశ



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి నేతలు మరీ ముఖ్యంగా టిడిపి నాయకులకు మేలు చేసేలా ప్రభుత్వం ఒక్కొక్కటి చేసుకువెళ్తోంది. ఇకపై రాజకీయ పాలన సాగిస్తామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించినట్లుగానే నేతలకు పదవుల భరోసా దక్కుతోంది. ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల కంటే ముందుగానే నేతలకు ప్రయోజనం చేకూర్చే పనులపై నిర్ణయాలను తీసుకుంటుండటం చూస్తున్నాం. ఏటా జనవరిలో జాబ్ కేలండర్ ప్రకటించి ప్రభుత్వశాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామంటూ ఎన్నికల ముందు చంద్రబాబు, లోకేష్ యువతకు మాటిచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జాబ్ కేలండర్ హామిని అటకెక్కించి ప్రస్తుతం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు కేలండర్‌ను అమలు చేయడం చూస్తున్నాం. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పలు కార్పొరేషన్లకు చైర్మన్లు, డైరెక్టర్ల పదవులను ప్రభుత్వం ఐదారు విడతలుగా నియామకాలు జరిపింది. ఆ తర్వాత జిల్లాలో సైతం ఖాళీగా ఉన్న డిసిసిబి చైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను భర్తీ చేసింది. నిరుద్యోగ యువతకు భరోసా నిచ్చే ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడలేదు. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన తర్వాత ఒక జనవరి గడచిపోయింది. యువనేత లోకేష్ పదేపదే చెప్పిన జాబ్ కేలండర్ మాత్రం వెలువడలేదు. అధికారంలోకి వస్తే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడానికే అన్నట్లు ప్రస్తుతం దానిని అమలు చేస్తున్నట్లుగా కనిపిస్తోంది. జిల్లాలో ఇటీవల నియోజకవర్గాల వారీగా నిర్వహిస్తున్న జాబ్ మేళాలు ఇందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. కోటబొమ్మాళి, శ్రీకాకుళం, పాతపట్నం, నరసన్నపేటలో జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు స్వయంగా పోస్టర్లను ఆవిష్కరించి అవకాశాన్ని వినియోగించుకోవాలని పిలుపునివ్వడంతో నిరుద్యోగుల నుంచి మంచి స్పందన కనిపించింది. ప్రభుత్వపరంగా దాదాపు పదేళ్లుగా రిక్రూట్‌మెంట్ లేకపోవడంతో ఏదో ఒక ప్రయివేట్ ఉద్యోగంలో చేరి సెటిలవుదామని ఆశగా వచ్చిన యువతకు నిరాశే మిగిలింది. నెలకు రూ.15 వేలు ఇస్తాం, నెల్లూరులో పని చేస్తారా అన్ని కంపెనీలు అడగటంతో నిరుద్యోగులు బిక్కమొఖం వేశారు. రూ.15 వేలు జీతంతో ఏం బతుకుతామంటూ ఉసూరుమంటూ ఇంటిముఖం పట్టారు. దీంతో జాబ్ మేళాల లక్ష్యం పెద్దగా నెరవేరలేదన్నట్లుగా చర్చనడుస్తోంది. నాలుగు చోట్ల నిర్వహించిన జాబ్‌మేళాలకు 5 వేల మందికి పైగా హాజరయితే అందులో 1450 మంది ఎంపికయ్యారు. వారిలో ఉద్యోగాల్లో చేరింది మాత్రం వెయ్యి మంది ఉన్నట్లు అధికారులు చెప్తున్నారు. జిల్లాలో జాబ్‌మేళాల నిర్వహణ కొత్తేమి కాదు. గతంలో జిల్లా ఉపాధి కార్యాలయం, స్కిల్ డవలప్‌మెంట్ డిపార్టుమెంట్లు చాలాసార్లు ఇటువంటి మేళాలు ఎన్నో నిర్వహించాయి. నియోజవర్గ కేంద్రాల్లో నిర్వహణ, ఎమ్మెల్యేలతో పోస్టర్ల ఆవిష్కరణ వంటి కార్యక్రమాలతో కొత్తగా ఏదో చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రచారం చేసుకోవడానికే ఈ బిల్డప్ అంతా అని నిరుద్యోగుల నుంచి గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధికారంలోకి వచ్చిన దాదాపు పదకొండు నెలల తర్వాత కూటమి ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల జారీ, కార్డుల్లో మార్పులు, చేర్పులకు అవకాశమివ్వడంతో అర్హులైన పేదలకు కొంతమేర ఉపశమనం కలిగించినట్లయింది. అయితే ఆ ఉత్సాహం ఎంతోసేపు నిలవలేదు. కొత్త కార్డుల కోసం సచివాలయాలకు వెళ్తున్న దరఖాస్తుదారులకు నిరాశే మిగులుతోంది. కొత్త కార్డులు పొందేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న నిబంధనలతో దరఖాస్తు చేసే అవకాశం లేకుండాపోవడం ఇందుకు కారణంగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, అర్బన్ ప్రాంతాల్లో రూ.12 వేలు ఆదాయం పొందుతున్న వారిని అనర్హులుగా ప్రభుత్వం పేర్కొంది. దీంతో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీలు తదితర చిరుద్యోగులు కొత్త కార్డులకు నోచుకోలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న ధరలతో నెలకు రూ.10 వేలు, రూ.15 వేలు ఆదాయం వస్తే ఒక కుటుంబం ఎలా బతకగలదు? ప్రభుత్వం వేతనాలు పెంచదు సరి కదా? ఇటువంటి సంక్షేమ పథకాలకు వారిని దూరం చేయడం విచారకరం. కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు అనర్హులని తెలిపింది. విద్యుత్ వినియోగం 300 దాటిన కుటుంబాలకు కొత్త కార్డులు ఇవ్వబోమని ప్రభుత్వం మార్గదర్శకాల్లో పేర్కొంది. వీటితో పాటు ఐదు ఎకరాల మెట్టు, మూడు ఎకరాల పల్లం భూమి కలిగి ఉన్నా వారినీ అనర్హులని చేసింది. కొత్త కార్డుల జారీకి గత వైసిపి ప్రభుత్వం ఏ నిబంధనలయితే రూపొందించిందో వాటినే కూటమి ప్రభుత్వం యథాతథంగా అమలు చేయడం గమనార్హం. వైసిపి ప్రభుత్వం తీసుకున్న అన్ని నిర్ణయాలను తిరగదోడుతున్న కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం, పేదలకు ఉపయోగపడే అంశాల విషయంలో మాత్రం సమీక్షించడానికి ఇష్టపడినట్లు లేదు. వీలైనంత ఎక్కువ మందికి రేషన్ కార్డులు ఇస్తే సబ్సిడీ భారం భరించాల్సి వస్తుందని ప్రభుత్వం బహుశా భావించినట్లుగా కనిపిస్తోంది. జగన్ నొక్కే బటన్‌లన్నీ తాము అందించే పించన్లతో సమానమంటూ ఒకవైపు బహిరంగ సభల్లో చెప్తూ అమలు దగ్గకొచ్చే సరికి సంక్షేమ పథకాలకు పెడుతున్న కోతతో ముఖ్యమంత్రి చంద్రబాబు ద్వంద్వ వైఖరి బయటపడుతోంది. తన జీవితం పేదలకే అంకితమంటూ పదే పదే చెప్తున్న చంద్రబాబు పేదలకు ఇచ్చే పథకాలను రకరకాల ఆంక్షల పేరుతో వారికి దూరం చేయడం ఇదేం రకం అంకితమో మరి!

ఇండేన్ గ్యాస్ ఆఫీస్ ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇండేన్ గ్యాస్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరులోని సింహాద్రి ఇండేన్ గ్యాస్ కార్మికులకు రెండు నెలల వేతన బకాయిలు యాజమాన్యం వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు, గ్యాస్‌వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో శనివారం తమ సమస్యలపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా గ్యాస్ కార్మికుల బకాయిలు చెల్లించాలని, కనీస వేతనాలు, పి.ఎఫ్.ఇ.ఎస్.ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలు అమలు చేయాలని కోరారు. అలాగే కార్మికులపై వేధింపులు ఆపాలని కోరారు. ప్రశ్నిస్తే దౌర్జన్యపూరితంగా వ్యవహరిస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నదని అన్నారు. యాజమాన్యం కార్మికుల శ్రమ దోపిడికి గురిచేస్తుందన్నారు. ప్రభుత్వ యంత్రాంగం జోక్యం చేసుకుని గ్యాస్ డెలివరీ బాయ్స్, వర్కర్స్ సమస్యలు పరిష్కరించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పి.అప్పలనాయుడు, యూనియన్ నాయకులు సురేష్, వెంకటరావు, చిన్న, బలరాం, లక్ష్మంనాయుడు, నీలం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వరరావు

యోగాతో మానసిక వికాసం

ప్రజాశక్తి- రణస్థలం

ఇటీవలి కాలంలో సెల్‌ఫోన్ వినియోగం పెరిగిపోవడంతో పిల్లల్లో దృష్టి సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారని ఎచ్చెర్ల ట్రిపుల్ ఐటి యోగా విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ఈశ్వరరావు అన్నారు. శనివారం హరిత ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, బుడుమూరు యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుడుమూరు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి యోగా, ధ్యానం శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా చాలామంది సెల్‌ఫోన్‌కు బానిసవుతున్నారని, దీనివలన సమయం వృథాతో పాటు కంటిచూపు మందగిస్తుందన్నారు. రోజులో కొంచెం సమయం కేటాయించి చిన్నచిన్న యోగాసనాలు సాధన చేయడం ద్వారా చాలా సమస్యలను అధిగమించవచ్చని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు ఆర్.హరిబాబు, బుడుమూరు యూత్ అసోసియేషన్ కారదర్శి కనకరాజు, సభ్యులు సత్యరాజు, అనిల్ కుమార్, పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ధర్మారావు

విద్యార్థులు ఉన్నత స్థానానికి ఎదగాలి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానానికి ఎదగాలని డిప్యూటీ డైరెక్టర్ ఖజానా విశ్రాంత అధికారి అంకం ధర్మారావు అన్నారు. జిల్లా యాదవ సంక్షేమ సంఘం, బాలగోపాల యాదవ సంఘం ఆధ్వర్యాన స్థానిక ఎస్‌బిఎస్ హైస్కూల్ ఆవరణంలో ఇటీవల 10వ తరగతి, ఇంటర్ ఫలితాల్లో విజయం సాధించిన యాదవుల విద్యార్థులకు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రణాళిక ప్రకారం చదువుకుంటే అనుకున్న లక్ష్యాలకు చేరుకోగలరన్నారు. తల్లిదండ్రులకు, పుట్టిన గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు శిరసాన వెంకటరమణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్, కోశాధికారి బత్తుల గోవిందరావు, స్థానిక అధ్యక్షులు పల్లెల వెంకటరావు, మంచిపల్లి రాజారావు, యాదవ సంఘం నాయకులు ఉకుట్ల అమ్మనరావు, బత్తుల మురళీమోహన్, జడ సత్యనారాయణ, నక్క రాము పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

ఆస్పత్రిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: రోగులకు మెరుగైన వైద్య సదుపాయాలు అందించే విధంగా ఆస్పత్రి యాజమాన్యాలు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల వద్ద శాంతి నగర్ కాలనీలో ఉషోదయ క్లినిక్ ఆర్థోపెడిక్ అండ్ డెంటల్ కేర్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి శనివారం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో అత్యవసర వైద్యం కోసం విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని, నేడు శ్రీకాకుళంలో కూడా కార్పొరేట్ స్థాయి అత్యవసర వైద్య సేవలు అందుతుండడం సుభపరిణామమన్నారు. ఆస్పత్రిలో వైద్యసేవలు అందుబాటులో ఉంచడంతో పాటు పేదలకు అవసరమైన వైద్యాన్ని తక్కువ ధరలకే అందించాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసి అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, ప్రముఖ వైద్యులు కింజరాపు అమ్మన్నాయుడు, గొండు గంగాధర్, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు మెండ దాసునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సాంకేతిక పనిముట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

వ్యవసాయ రంగానికి ఊతమందించే లక్ష్యంతో జిల్లాలో సాంకేతి కంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు పనిముట్లు అందుబాటులోకి తీసుకొచ్చామని వినాయక ఆగ్రో ఇండస్ట్రీ ఎండి విజయకుమార్ తెలిపారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అతి తక్కువ ధరలో రైతుకు కావాల్సిన అన్ని రకముల వ్యవసాయ యంత్రాలు, యంత్ర పరికరాలు, మెకానిక్ సర్వీసు హోల్‌సేల్ రేట్లులో అందిస్తున్నట్టు తెలిపారు. పవర్ వీడర్స్ వాటి స్పేర్ పార్ట్స్, కొత మిషన్లు వాటి స్పేర్ పార్టులు, పవర్ టిల్లర్స్, స్పేర్ పార్ట్స్, బ్రష్ కటర్స్, ట్రాక్టర్ రోటో వేటర్స్, విడిభాగాలు, పవర్ స్పేయర్స్ విడిభాగాలు, బ్యాటరీ స్పేయర్స్, గుంతలు తీయు యంత్రం, ఎర్త్ ఆగర్స్, పెట్రోల్ అండ్ డీజిల్ ఇంజిన్స్, ఛాఫ్ కట్టర్స్, పాలు తీయు యంత్రములు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇతర వివరాల కోసం వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్, 8096695809 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

- రహదారి పక్కనే వ్యర్థాలు
- అవస్థల్లో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

వ్యర్థాలతో అనర్థం..!

ప్రజాశక్తి- బూర్జ

వ్యర్థాలతో పలు అనర్థాలు చోటు చేసుకుంటున్నాయి. అంతేకాకుండా పలు సమస్యలు తలెత్తుతున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. పాలకొండ - శ్రీకాకుళం రహదారికి అనుకుని ఉన్న మండలంలోని కొల్లివలస, ఉప్పినవలస, కె.కె.రాజపురం, పాలవలస, లక్కుపురం తదితర గ్రామాల్లో రహదారికి ఇరువైపుల వ్యర్థాలను పారవేయడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేకాకుండా ప్రమాదాలు సంభవించడంతో పాటు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో అనునిత్యం గ్రామాల్లో సేకరించిన చెత్తను రహదారికి ఇరువైపులా పారబోసి నిప్పంటించడంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు కాలుష్యం విపరీతంగా పెరిగిపోతుందని వాహన దారులతో పాటు గ్రామస్తులు వాపోతున్నారు. రాత్రుల సమయాల్లో దట్టమైన పొగ అలముకుని రహదారి కనిపించక ప్రమాదాలు జరిగిన సందర్భాలు కూడా ఉన్నాయని వాహనదారులు వాపోతున్నారు.

కోళ్ల వ్యర్థాలతో అవస్థలు

ముఖ్యంగా కొల్లివలస గ్రామ సమీపంలో కోళ్ల నుంచి వచ్చిన వ్యర్థాలను పారవేయడంతో వీటికోసం సునకాలు రహదారిపై పరుగులు పెట్టడంతో వాహనాలకు అడ్డంగా పడి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అంతేకాకుండా వ్యర్థాల నుంచి వచ్చిన దుర్వాసనతో ముక్కుపుటాలు అదురుతున్నాయని, ఈ గ్రామం దగ్గరకు వచ్చేటప్పటికే ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు.

ఇదే విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కనీసం పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి వ్యర్థాల వలన జరుగుతున్న అనర్థాలను అరికట్టేందుకు తగు చర్యలు తీసుకోవాలని, తద్వారా సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాలకు చెందిన వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

కంపు భరించలేకపోతున్నాం

కుళ్లిన పదార్థాలను, వ్యర్థాలను రోడ్డుకు ఇరువైపులా పార వేయడంతో దుర్గంధం వెదజల్లడంతో భరించలేని పరిస్థితులున్నాయి. అధికారులు పరిశీలన జరిపి పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలి.

పెద్దింటి శ్రీను, కిలంతరి

ప్రమాదాలను నివారించాలి

వ్యర్థాల వలన తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్లపైన వ్యర్థాల కోసం సునకాలు పోటీపడడంతో సమస్య తీవ్రంగా ఉంది. అధికారులు స్పందించి ప్రధాన రోడ్డుకు ఇరువైపుల వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలి.

పాగిరి నాని, విద్యార్థి

తాగునీటి సరఫరాకు వినతి

ఇచ్ఛాపురం: మండలంలోని తెలుకుంచి పంచాయతీలో తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ పి.రాజశేఖర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఎంపిడిఒ రామారావును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచ్‌కు తెలియకుండా విద్యుత్‌శాఖ అధికారులు అడ్డదిడ్డంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వేశారని అన్నారు. దీంతో గ్రామానికి సరఫరా చేస్తున్న ఇంటింటి కుళాయి నీరు సరఫరాకు తీవ్ర ఆటంకం కలిగిందన్నారు. వారికి నచ్చిన దగ్గర నచ్చినట్టు కొత్త విద్యుత్ స్తంభాలు వేయడంతో తాగునీటికి ఆధారమైన పైప్‌లైన్‌ను తవ్వేశారని తెలిపారు. రెండు దగ్గర పంచాయతీ నిధులతో బాగు చేశామని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కింద నుంచి తాగునీరు వచ్చేస్తుందని అన్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక విద్యుత్‌శాఖ ఎఇని అడిగామని, తమకు సంబంధం లేదని చెప్పారని అన్నారు. చివరకి పంచాయతీ నిధులతో ఉద్దానం వాటర్‌ను ఇంటింటా కుళాయి కలుపు దామని నిర్ణయించామన్నారు. కానీ, స్థానిక నాయకులు అడ్డుపడుతున్నారన్నారు. తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, మీరు చొరవ చూపి నీటిని సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

శ్రీకాకుళం: దీర్ఘకాలంగా ఇంజినీరింగ్ విభాగంలో టెక్నికల్, నాన్ టెక్నికల్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, సీనియారిటీ ప్రకారం ప్రమోషన్ కల్పించాలని కోరుతూ ఎఐటియుసి ఆధ్వర్యాన నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లరిబ్బన్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ పారిశుధ్య, ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ నాయకులు పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇంజినీరింగ్ కార్మికులకి న్యాయం చేయకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన తప్పదని హెచ్చరించారు. యూనియన్ నాయకులు శ్యామలరావు, సతీష్, నాయకులు ముఖేష్ యాదవ్, శంకర్, శ్రీను, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా దళిత, ఆదివాసీ ఆత్మీయ సభ

శ్రీకాకుళం: దళిత, ఆదివాసీల హక్కుల రక్షణ కోసం ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీసభ్యులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు అన్నారు. శనివారం ఎన్‌జిఒ హోంలో దళిత ఆదివాసీ సంఘాల ఉమ్మడి ఐక్యవేదిక ఆధ్వర్యాన ఎస్‌సి, ఎస్‌టి మోనటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన పలువురిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 59 ఉపకులాలకు చెందిన దళితులు ఒకే వేదిక పైకి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్‌కు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు మొదలు పెట్టిందని, అందులో భాగంగా దళితులు రుణాలు పొందడానికి అవకాశం కల్పించారన్నారు. ఇటీవల ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా నియమితులైన దండాసి రాంబాబు, దాసరి తిరుమలరావు, కళింగపట్నం అప్పన్న, తోట రాము, గేదెల రమణమూర్తితో పాటు ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావును సత్కరించారు. పోతల దుర్గారావు, పిన్నింటి అప్పన్న, బి.వేణుగోపాల్, కెఎన్ మూర్తి, గంజి ఆర్ ఎజ్రా పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

కోటబొమ్మాళి: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ మామిడి అప్పల నాయుడు, బొడ్డేపల్లి అశోక్‌లు అన్నారు. మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ చిన్నహరిశ్చంద్రపురంలో ఉపాధి హామీ కూలీలతో యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యాన శనివారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే ఎటిఎం నంబరు, బ్యాంకు వివరాలను అడిగితే వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. అలాగే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ కోసం వివరించారు. నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక క్షేత్ర సహాయకుడు బగాది తేజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు 11 కెవి చినబాడాం ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నామని అన్నారు. దీని పరిధిలోని పెంటిభద్ర, జయచంద్రపురం, పద్మనాభపురం, పాత జాతీయ రహదారి, తాళ్లభద్ర, నీలాపురం, నర్సిపురం, రైల్వే గేట్ డౌన్, పెసరపాడు, చినబాడాం, అంతరకుడ్డ, రాజపురం ప్రాంతాల ప్రజలు సిబ్బందికి సహకరించాలని కోరారు.

రేపు...

సోంపేట : మండలంలోని భూషభద్ర సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతు పనులు చేస్తున్నందున పొత్రకొండ, మాకన్నపురం, బాతుపురం, ఎం.జి.పురం సుంకిడి, భూషభద్ర తదితర గ్రామాలకు సోమవారం ఉదయం 9 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ యజ్ఞేశ్వరరావు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పాతపట్నం: మండలంలోని గురండి, ఎ.ఎస్.కవిటి గ్రామాల్లో శనివారం ప్రకృతి వయవసాయం అవగాహన కల్పించారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ప్రణాళిక గురించి వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల కలిగే లాభాలు, ఉపయోగాలు వివరించారు. కార్యక్రమం గ్రామ రైతులు మహిళా సంఘ సభ్యులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవికుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మధురెడ్డి

శాలిహుండం భూములు పరిరక్షించాలి

ప్రజాశక్తి- పొందూరు

శాలిహుండం వేణుగోపాలస్వామి ఆలయం భూములు ఆక్రమణలకు గురికాకుండా పరిరక్షించాలని ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను ఆలయం ట్రస్టీ చైర్మన్ సుగ్గు మధురెడ్డి కోరారు. శనివారం మండలం పెనుబర్తిలో ఆయన స్వగృహంలో రవికుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పొందూరు మండలంలో సుమారు 8.50 ఎకరాలు శాలిహుండం భూములు న్నాయని, వీటిని పలువురు ఎటువంటి లీజులు చెల్లించకుండా ఆక్రమణలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ భూములు ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలకు గురవుతున్నాయని, వాటిని సంరక్షించాలని స్థానిక రెవెన్యూ యంత్రాంగానికి ఎన్నిసార్లు కలిసి మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ దేవాదాయ భూముల సంరక్షించడం అనేది ధర్మకర్తలతో పాటు అధికారులకు ఉందని, దేవాదాయ చట్టంపై ప్రజలకు అవగాహన లేకపోవడం వలన చాలా తప్పులు చేస్తున్నారని, ఈ భూములను ఎవరైనా ఆక్రమణ చేస్తే ఎటువంటి నోటీస్ ఇవ్వకుండా వాటిని తొలగించే అధికారం ఎండోమెంట్ అధికారులకు ఉందన్నారు. శాలిహుండం భూములను ఎవరు ఆక్రమించినా వాటిని తొలగిస్తామన్నారు. ఈ భూములను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందని, తహశీల్దార్, కలెక్టర్‌కు ఈ విషయంపై తెలియజేస్తున్నానని తెలిపారు. ఈయనతో పాటు టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి ఉన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గోకర్ణపురం వద్ద రాధాకృష్ణ సాగరంపై రూ.90 లక్షలతో వంతెన నిర్మాణానికి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శనివారం శంకుస్థాపన చేశారు. అలాగే ఉపాధి హామీ నిధులు రూ.28లక్షలతో సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. తన సొంత నిధులు రూ.50 వేలుతో చేపట్టిన వాటర్ ట్యాంక్ పనులను ప్రారంభించారు. గోకర్ణపురం నుంచి సంతలక్ష్మీపురం మధ్య రహదారిని అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కేంద్ర మాజీ మంత్రి ఎర్రనాయుడు విగ్రహాలకు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, నియోజకవర్గ బిజెపి ఇన్‌ఛార్జి సలాన శరత్‌కుమార్, గౌడ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపిపి సలాన మోహనరావు, ఎఎంసి మాజీ వైస్‌చైర్మన్ అనపాన రాజశేఖర్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌కు ఎంపికైనట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాలలో విద్యార్థులను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి) కోర్సు చదువుతున్న ఆఖరి ఏడాది మొదటి సెమిస్టర్‌కు చెందిన మార్పు సిద్ధార్థ, బాడిత సాయి దుర్గారావు, బొమ్మాళి నిఖిత, పైల సుఖన్యలు హైదరాబార్ కేంద్రంగా ఉన్న 'యంత్రా ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రైవేటు లిమి టెడ్' కంపెనీలో నాలుగు మాసాల పాటు ఇంటర్న్షిప్ శిక్షణ పొందేందుకు ఎంపికయ్యారని అన్నారు. ఈ శిక్షణా కాలంలో ఒక్కొక్కరికి నెలకు రూ.20 వేలు చొప్పున స్టైఫండ్ చెల్లిస్తుందన్నారు.

అభినందిస్తున్న డైరెక్టర్ నాగేశ్వరరావు

శిక్షణా కాలం పూర్తయిన తరువాత ఇదే కంపెనీలో ఈ అభ్యర్థులు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఐతమ్ విద్యార్థులకు ఇంటర్న్షిప్, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న యంత్రా ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రైవేటు లిమిటెడ్ వ్యవస్థాపక సిఇఒ తులశీరావు చింత, చీఫ్ డేటా సైంటిస్ట్ సోమేశ్వరరావు చింతలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌డి డాక్టర్ బాలక రమేష్ నాయుడులు అభినందించారు.

మట్టితో కప్పేసిన సాగునీటి కాలువ

పంట కాలువ పూడ్చివేత

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు
- ఆందోళన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని బొబ్బిలిపేటలో సుమారు 150 ఎకరాలకు సాగునీరు అందిస్తున్న సాగునీటి కాలువను కొంతమంది వ్యక్తులు మట్టితో పూడ్చి వేసేశారని గ్రామానికి చెందిన మెట్ట శ్రీనివాసరావు అనే రైతు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలోని బాగమ్మ చెరువు నుంచి 70 మంది రైతులకు చెందిన పంట పొలాలకు పూర్వం నుంచి సాగునీటి కాలువ ఉండేదన్నారు. ప్రభుత్వం కూడా ఆ కాలువను పక్కా నిర్మాణంగా మారుస్తూ ఇటీవల రూ.8 లక్షలతో నిర్మాణ పనులు కూడా చేపట్టారని తెలిపారు. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు సిమెంట్ కాలువలో ట్రాక్టర్లతో మట్టిని దౌర్జన్యంగా వేసి పూడ్చివేసి ఆక్రమించుకున్నారని తెలిపారు. ఈ ఆక్రమణపై కాలువ ఆయకట్టు రైతులతో కలిసి మండల తహశీల్దార్ కార్యాలయంలో నెల రోజుల కిందట ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొద్ది రోజుల్లో ఖరీఫ్ సాగు పనులను రైతులు ప్రారంభించాల్సి ఉందని బాగమ్మ చెరువు నుంచి కాలువ ద్వారా నీటి ఆధారంతో పంటల పండించాల్సి రైతులు పరిస్థితి అర్థం కాక ఆందోళన చెందుతున్నారు. జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు బాగమ్మ చెరువు సాగునీటి కాలువ పూడ్చివేతపై చర్యలు తీసుకోకపోతే భవిష్యత్‌లో గ్రామం చుట్టూ ఉన్న అన్ని సాగునీటి కాలువలు కూడా ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించి సాగునీరు పంట పొలాలకు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి అంగీకారం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో గ్యాస్ కంపెనీ వద్ద ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడానికి పుర ప్రముఖులు అంగీకారం తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యాన శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టే సమయంలో స్థానికుల నుంచి కొంతమంది అభ్యంతరం చెప్పాడు. దీంతో అభివృద్ధి పనులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఈ నేపథ్యంలో మరోసారి ఎటువంటి అభ్యంతరాలు అనుమానాలకు ఆస్కారం లేకుండా పుర ప్రజలతో అభిప్రాయం సేకరణ కోసం శనివారం సమావేశం నిర్వహించారు. రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజ్‌కుమార్, పి.దినేష్‌లు పర్యవేక్షణ చేశారు. శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉలాలా బాలయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి రాజు, టిడిపి పట్టణ అధ్యక్షుడు కాళ్ల ధర్మారావు, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్‌కుమార్, లీలారాణి, నందిక జాని, రోటరీ క్లబ్ ప్రతినిధులు మాటూరి నవీన్, డాక్టర్ వ్యాద వ్యాస్, దాసు. ఎం.సూర్యం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

అవకాశాలు కోల్పోతున్నాం

ప్రజాశక్తి- కవిటి

తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో విద్యావ్యవస్థలో, పోటీ ప్రపంచంలో తమ బిడ్డలు విలువైన అవకాశాలు కోల్పోతున్నారని పలువురు బెంతు ఒరియాలు వాపోయారు. తమ సమస్యల పరిష్కారానికి బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న నిరాహార దీక్షలు 500వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా శనివారం దీక్షలో ఆముదాలపుట్టుగ, సూదిపుట్టుగ బెంతు ఒరియాలు పాల్గొన్నారు. వీటికి ఉషోదయ యువజన సంఘం సభ్యులు దీక్షలో పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు. అనంతరం బెంతు ఒరియాలు మాట్లాడుతూ ఉన్నత చదువులకు సంబంధించి అన్ని నోటిఫికేషన్లు జారీ చేశారని, కానీ తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు అవకాశం కోల్పోతున్నట్టు తెలిపారు. చాలామంది యువకులు ఉపాధి కూడా కోల్పోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని తమకు కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని వారు కోరారు. ఈ దీక్షలో ఉషోదయ యువజన సంఘం అధ్యక్షుడు ఆరింగి కృష్ణారావు, సభ్యులు ఆరంగి త్రివిక్రమరావు, బెందాళం రంగారావు, తెప్పల మోహనరావు, దున్న పురుషోత్తం, పిన్నింటి శ్రీను, హరీష్ సాహు, పితంబర్ దొళాయి, సుమన్ బిసాయి, రమేష్ జెన్న, దుదిష్టి మజ్జి, తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- ఆమదాలవలస

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ (ఆమదాలవలస) మూడో నెంబర్ ప్లాట్ ఫామ్ వద్ద ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల మేరకు రేగిడి ఆమదాలవలస మండలం పుర్లి గ్రామానికి చెందిన రేగిడి సురేష్ (28) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడు సురేష్ శ్రీకాకుళం పట్టణంలో ఓ ప్రైవేట్ జాబ్ చేస్తున్నాడని శుక్రవారం రేగడి ఆమదాలవలసలో ఓ పెళ్లికి హాజరై వస్తానని పని చేసిన చోట చెప్పి వెళ్లినట్లు సమాచారం. ఇంటికి వెళ్లి వచ్చిన సురేష్ రైలు కిందపడి మరణించాడు. సురేష్ తమ తల్లిదండ్రులకు ఒక్కగానొక్క కొడుకు. సురేష్ తండ్రి జగన్నాథం గతంలో మరణించారు. గతంలో తండ్రి ఇప్పుడు కుమారుడు కూడా మరణించడంతో ఆమె ఒంటరి అయిందని స్థానికులు చర్చించుకుంటున్నారు. సురేష్ మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందని జిఆర్‌పి ఎస్ఐ మధుసూదనరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

గుర్తు తెలియని మృతదేహం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ దగ్గరలో బహుదా నది బ్రిడ్జిపైన గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పలాస జిఆర్‌పి పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడు వయసు 65-70 మధ్యలో ఉంటుందని తెలిపారు. వైట్ రంగు గల షర్టు, పైన నిలువుగా నల్లని గీతలు ఎర్రని లుంగీ, తల మెరిసి ఉందన్నారు. మీసాలు గీసి ఉన్నాయని అన్నారు. మృతదేహాన్ని ఎవరైనా గుర్తిస్తే 9440627567 సెల్ నంబరును సంప్రదించా లన్నారు. జిఆర్‌పి ఎస్ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సారా నిర్మూలనపై అవగాహన

కొత్తూరు : నవోదయం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కారిగోడ పంచాయతీలో ఎగుదండ, మానుగూడ, దిగువదొండమాను, చింతమానుగూడ గ్రామాల్లో సాటుసారా నిర్మూలనపై అవగాహన కల్పించారు. సారా రహిత గిరిజన గ్రామాలుగా పంచాయతీ తీర్మానం చేశారు. కార్యక్రమంలో ఆమదాలవలస ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ మనీశ్వరి, సర్పంచ్ సవర లొద్దు, విఆర్‌ఒ భాస్కర్, కార్యదర్శి పాల్గొన్నారు.

వాహన పత్రాలను పరిశీలిస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండల కేంద్రంలో పోలీసులు ద్విచక్ర వాహనాల తనిఖీ విస్తృతంగా చేపట్టారు. శనివారం హెచ్‌సి మెండ జనార్దనరావు ఆధ్వర్యంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాలను పోలీసులు ఆపి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గతంలో చలాన్‌లు కట్టకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి ఇ-సేవా కేంద్రంలో అపరాధ రుసుం కట్టించి వాహనాలను విడిచిపెట్టారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ పత్రాలు కలిగి ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. వాహన దారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం

శ్రీకాకుళం: స్థానిక గుడివీధి సచివాలయం పరిధి అంగన్వాడీ కేంద్రాల్లో కిశోర వికాస వేసవి సెలవుల కార్యక్రమాన్ని ఘనంగా సంబంధిత అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమం బాల్య వివాహాల నిరోధిక పరివేక్షణ కమిటీల ఆధ్వర్యంలో సూపర్‌వైజర్ ఉమా గౌరీ పరిరక్షణలో అంగన్వాడీ కార్యకర్త ఎంఎస్‌కె, బి.పద్మజ, ఆశ, ఎఎన్‌ఎంల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు, దుష్ప్రభావాలను దృశ్య రూపంలో అర్థమయ్యేలా వివరించారు. బలవంతంగా చేసే బాల్య వివాహాలను అడ్డుకునే ప్రయత్నం సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా చేస్తామని వారంతా ప్రతిజ్ఞ చేసి బాల్యవివాహాలను అడ్డుకుంటామని తీర్మానం చేశారు.

కొనసాగుతున్న వేసవి శిక్షణ

లావేరు: చిన్నతనం నుంచే భగవద్గీతను తెలుసుకుని సంప్రదాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు మేడూరి ప్రసాదరావు అన్నారు. శనివారం బెజ్జిపురం వివేకానంద సదనంలో భరత నాట్య శిక్షణా భగవద్గీత వేసవి శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరజా శుభ్రమణ్యం అభినయనృత్యనికేతన్ ఆధ్వర్యంలో 30 రోజుల పాటు నృత్య నాట్య శిక్షణా తరగతులు నిర్వహించడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్వామి పరాత్మ నంద సరస్వతి స్వామి, పూర్వాజానంద, గంట్యాడ అప్పలనాయుడు, నాగేశ్వరరావు, లక్ష్మీనాయుడు, రమణ, రామారావు పాల్గొన్నారు

ఆలయ నిర్మాణానికి విరాళం

కవిటి: కవిటి నుంచి సముద్ర తీరానికి చేరుకునే మార్గంలో నూతనంగా నిర్మిస్తున్న కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విశ్రాంత డిఎస్‌పి ఎస్.వి.వి.ప్రసాదరావు రూ.50 వేలు విరాళం అందించారు. ఈ సందర్భంగా శనివారం ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన ప్రసాదరావు ప్రశాంతమైన వాతావరణంలో నిర్మిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో డిక్కల బాబూరావు, బిపి రెడ్డి, మొగలిపురి సీతారాం పాల్గొన్నారు.